

# వేటూరి సాహితీ ఝరి




తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## విపర్యయాలు

**– వేటూరి సుందరరామ్మూర్తి**

(1959 సెప్టెంబర్ 30 – ఆంధ్రపత్రిక వారపత్రిక నుంచి)




"ఇదిగో! ఇదే ఆఖరుసారి చెబుతున్నా – తర్వాత నన్నని ప్రయోజనం లేదు. గడువులోగా నాకివ్వవాల్సిన ఆరువేలూ అణాపైసల్తో సహా చెల్లించావా సరి. లేదా నా పెళ్ళాం బిడ్డల్ని నీవు శపించి లాభం ఉండదు జాగ్రత్త!"

చెప్పవలసిన మూడుముక్కలు ఠకీమని చెప్పి వెనక్కి తిరిగాడు వీరభద్రం.

నడిరోడ్డుకెక్కిన బ్రతుకుతో, ముళ్ళకంచెపై దుప్పటిపడ్డవానిలా కర్మవివశుడై నిగూఢంగా నిట్టూర్చాడు సూర్యం.

ముఖసాగరంలో విషాద లహరులు రెండు సుడులు రేగాయి చక్రవర్తికి.

❦❦❦

"అమ్మాయి రాణీ! నువ్వు ఎప్పుడెళ్ళాలమ్మా కాలేజీకి – ఎంతకట్టాలి? అసలు మొత్తం నీకెంత కావాలి?" వీరభద్రం కూతురుని అడిగాడు.

"మామూలు టెరం ఫీజు కాక ఈనెలకు మూడువందలు కావలసి ఉంటుంది నాన్నా" హుందాగా జవాబిచ్చింది రాణి.

"మూడువందలే! ఏమీటే మహలావు ఖర్చులు నీకు – ఎంతసేపు గుడ్డలు. దేనికైనా అంతూ బొంతూ ఉండాలి. జార్జికూతురు కూడా కట్టి ఉండదు చదువుకునే రోజుల్లో ఈ జార్జెట్లూ, సాటిన్‌లూను. ఎక్కడి డబ్బూ కట్టిన అందం ఉండిచావని గుడ్డలకు పెడతారు. ఏం పిదపకాలం వచ్చిందే" విసుక్కున్నాడు వీరభద్రం –

రాణి నొచ్చుకున్నది. ఒక వైఖరిగా కళ్ళు చిట్లించి సూదిమొనల్లా చూపులు పెట్టి "నాన్నా అయితే ఆడవాళ్ళ బట్టలదగ్గర్నించీ వాటి ఖరీదుల్నించీ నీకు అక్కర్లేనిదంటూ లేదన్నమాట. మూడువందలకు బట్టలేం రావు నాన్నా హోదాగా బ్రతకాలనుకుంటే. ఈ మాత్రానికే నీకింత కష్టం దేనికి సరైన బట్టలైనా లేక సాటివాళ్ళల్లో తలెత్తుకెలా తిరగాలి" అక్కసును అక్షరాల్లోకి అనువదించింది రాణి.

కండువా విదిలించి భుజంపై పారేసి మూడు నోట్లూ సోఫాలో పెట్టి వెడుతూ "కానీ అమ్మా కానీ.. ఇదుగో పైకం నా మాటలు అట్టే పట్టించుకోకండి మీరంతా – రోజులు గడవనీయండి ఎట్లాగో" అంటూ ఆవేశంగా అని బరువుగా వెళ్ళిపోయాడు వీరభద్రం.

"ఆ మనిషి తీరే అంత" అంటూ ఆ నోట్లు చేతపట్టుకు వచ్చి అమ్మాయిని అనునయించింది వర్ధనమ్మ.

నవ్వారుతో కట్టిన పాత జంపఖానా బెడ్డింగు, గుండీకి బదులు ఒక పిన్నీసు పెట్టుకున్న షర్టుతో చక్రవర్తి, కొత్తకాన్వాస్ హోల్డాలు మొదలైన టిప్‌టాప్ సామానులతో కూలింగ్ గ్లాసెస్‌తో రాణి, మరునాడు ఉదయం బండికి వచ్చి థర్డుక్లాసులోనూ, ఫస్టుక్లాసులోనూ ఎక్కారు. రైలు కదిలిపోయింది నిశ్చలంగా.

చక్రవర్తిని గురించి రాణి అభిప్రాయం 'మన్ను తిన్న పాము ' అని.

రాణీని గురించి అభిప్రాయపడవలసిన అవసరం, అవకాశం లేకపోయాయి చక్రవర్తికి.

ఇద్దరూ మద్రాసులో ఒకే కాలేజీలో చదువుతున్నారు. ఆ విషయం ఇద్దరికీ తెలుసు. కానీ ఒకే క్లాసు కాదు. చక్రవర్తి ఎం.ఏ ఫైనల్ ఇయరు. రాణీ బి.యేలోనే ఉంది.

కాలేజీ డే ఉత్సవాల్లో లైలా మజ్నూ నాటకం ప్రదర్శించాలని తలచారు విద్యార్థి సంఘం.

మజ్నూ పాత్రధారిగా చక్రవర్తిని ముందే నిర్ణయించాడు సూత్రధారి. మేకప్ చేసి చూసి 'మైగాడ్ అచ్చం మజ్నూవే ఫో!' అంటూ జబ్బ విరగ్గొట్టాడు మిత్రుడు మోహనరావు.

"చక్రవర్తి యెప్పుడూ ఇంత అందంగా కనిపించలేదు. వెలగల దుస్తులు వేస్తే అతను చక్రవర్తిలాగానే ఉన్నాడు. బీదతనం అందాన్ని మకమకలాడిస్తోంది" అన్నది సరోజ – రాణితో మది ప్రశ్నించే కనుపాపల్తో.

ఈసుతో నిర్లక్ష్యంగా కళ్ళు చక్రవర్తిపైకి త్రిప్పిన రాణీ లజ్జతో మోసులు వేసే ఊసులతో కళ్ళను సరోజవైపు తిప్పింది. తర్వాత అదో లోకంలో నివసించడం మొదలుపెట్టింది రాణి.

దేహం ఇక్కడే వదిలి మరో లోకంలోకి బట్వాడా అయిన రాణిని బుగ్గపై వేల్తో కోపంగా పొడిచి స్పృహ తెప్పించి మరీ అడిగింది మాలిని, 'అవతల పిలుస్తున్నారు వినపడుతోందా' అని.

రాణీ వెనుదిరిగి చూసేసరికి కాలేజి విద్యార్థి సంఘం నాయకుడు, నాటక సూత్రధారీ అయిన ఫలానారావుగారు "సదరు నాటకం వేసే విషయంలో లైలా పాత్రకు మిమ్మల్ని ముందే బుక్ చేసుకుని వెనకాల అడగాలని వచ్చాం – ఇందుమూలంగా నామకః మీ అంగీకారం అడుగుతున్నాం గనుక అది ముందే ఇచ్చేసినట్లు భావిస్తూ మీకు నమస్తే" అని తరువాత కార్యక్రమంలోకి వెళ్ళిపోయాడు.

పెదవిదాకా వచ్చి ఆగిపోయిన అనుమానాల అభ్యంతరాల అనేక కారణాల మరీ భయాలు తిరస్కారం పురస్కారంగా మారి పువ్వొత్తిలా నవ్వులు రాలువారాయి రాణీకి – మేకప్పులో చక్రవర్తిత్వం పెంపరలాడుతున్న చక్రవర్తి చలించాడు ఒకింత. "వీరభద్రం కూతురు రాణియా?"

"అవునా – అప్పుడే విషాద భంగిమా నువ్వూనూ. ఇహ పద నీ పోర్షన్ చదవాలి" అన్నాడో నేస్తం.

ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య సవాలక్ష నవ్వొత్తులమధ్య నాయికా నాయకులు రజతపాత్రలందుకున్నారు ఉత్తమ నటనకు. కాలేజీడే ఉత్సవాలు దీపావళిలా వెలుగుతో వెలసిపోయాయి.

❦❦❦

వీరభద్రం సూట్ ఫైలు చేశాడు కోర్టులో – సూర్యం ఫలానా తేదీలోగా బాకి మొత్తం కక్కాలని లేదా అటాచ్‌మెంటు తప్పదనీ జడ్జి గర్జించాడు.

సదరు తేదీకి అన్నీ అయిపోయాయి. సూర్యం సూర్యచంద్రాదులు కూడా తోడుండే పాకలో కాపురం – బతకలేక బడిపంతులు ఉద్యోగం బరువుగా లాగుతూ.

ఇంట్లో వళ్ళు పట్టించుకుంటూ వీరభద్రం.

సూర్యం చెంబూ తప్పేలా, ఇల్లూ వాకిలీ వేలం వేసిన బాపతు డబ్బు అంతా బాకీ క్రింద జమ కట్టించి గుమాస్తా రామనాధంతో "ఏమంటున్నారు తండ్రీ కొడుకూను?" అన్నాడు వైఖరిగా తన దెబ్బకు సూర్యం చక్రవర్తీ ఏమనుకుంటున్నారో తెలుసుకుందామని.

భాగ్యవంతుల కొంపల్లో భాషాప్రవీణ రామనాధం చేతులు నలుపుతూ – "ఆ ఇంకా అనేదేముంది కొంపంతా చీకటయ్యాక వాడింకా సూర్యమేమిటి?" అన్నాడు దీర్ఘం తీస్తూ.

సింహంలా నోరంతా తెరిచి 'హహహా ' అని హాసగర్జన చేశాడు స్వీయ విజయ చిహ్నంగా వీరభద్రం. కొంచెంసేపు ఇలా గడిచింది.

"చక్రవర్తిట. కొడుకు పేరు పెట్టాడు చూడు. దేనికి చక్రవర్తో! అడుక్కుతింటానికి' అన్నాడు బొజ్జ నిమురుకుంటూ వీరభద్రం ఏవగింపు మొహంతో..

"అయ్యా ఒక్కమాట. ప్రపంచం చూడండి– అన్నీ విపర్యాయాలూ, విపరీతాలూనూ. గ్లాసెడు మంచినీళ్ళు తెచ్చిపెట్టని పిల్లపేరు గంగ. కానీలేని బిచ్చగత్తె పన్నెండో కూతురు పేరు రాజకుమారి, పట్టెడన్నం పెట్టి ఎరగని మహాతల్లి అన్నపూర్ణ. హేదో –విలో మానుబంధాలు, విపర్యానువాదాలును లోకం –" అన్న రామనాధం పాండిత్య ప్రకర్షకు బొబ్బగింత పెట్టి నవ్వి 'అద్భుతం' అని తలవిదిలించి కాంప్లిమెంటిచ్చాడు వీరభద్రం.

తన కూతురు నిజంగా రాణీయే అనుకున్నాడు సగర్వంగా తనలోతాను.

"'అన్నట్టు అమ్మాయి దగ్గర్నుంచి ఉత్తరాలే లేవేమిటో, ఈ గొడవల్లో మరచాను"

రామనాధం అందుకున్నాడు.

"అమ్మాయిగారు మూడు లెటర్సు రాశారండీ వారం వారం తేడాతో – మూడు మూడు వందలు పంపమని – తొమ్మిది వందలు సదరు మేరకు దాఖలు చేశానండి మనియార్డరుగా – ఈ గొడవల్లో నేనూ మరచాను " అన్నాడు కంఠం, కాళ్ళూ వణుకుతూ వినయం ప్రస్ఫుటమౌతున్న రామనాధం.

కాల్తున్న వళ్ళు పట్టించుకోలేక మండుతున్న ఉక్కుపిండంలా స్నానాలకొట్లోకి వెళ్ళి అవుత్‌ఖానాజీవం తీసేశాడు వీరభద్రం.

"ఆయన తత్త్వమే అంత ఇవాల్టిదా " అని రామనాధంతో అంటూ మూతివిరుస్తు వెనుదిరిగి లోపలికి వెళ్ళింది వర్ధనమ్మ.

❦❦❦

ఒకనాడు వీరభద్రం పేరిట ఉత్తరం వచ్చింది.

పరీక్షలకు అమ్మాయి హాజరు కాలేదని హాస్టల్లో ఆమె ఉండటం లేదని పదిహేనురోజుల క్రితం ఖాళీ చేసిందని...

తెల్లబోయాడు వీరభద్రం. బావురుమంది వర్ధనమ్మ. కనుబొమలు ముడివేసి మరీ ఆలోచించసాగాడు రామనాధం.

వర్ధనమ్మకు ధైర్యం చెప్పి, రామనాధం భార్యను ఆమెకు తోడుగా ఉంచి వీరభద్రం రామనాధం ఆదుర్దాగా బయలుదేరి వెళ్ళారు మూడుగంటల బండిలో మద్రాసు.

రైలు నడుస్తుండగా రామనాధం అన్నాడు "మన సూర్యం కొడుకున్నాడే వాడికైనా తెలీకుండా ఉంటుందంటారా..? ఏమిటో ఏం జరిగిందో ఎక్కడైనా అమ్మాయి కనిపించి ఐనా ఉండదూ!?"

చటుక్కున ఏదో స్ఫురించిన వీరభద్రం "లేకపోతే మనమీద పగచేత ఆ దిక్కుమాలిన చక్రవర్తిగాడు ఏమైనా అత్యాచారం చేయించలేదుగదా" దగ్గుత్తికతో సందేహం వెలువరించాడు.

"ఛాఛా వాడివల్ల అటువంటిదేం జరగదు. అయినా మొన్న తల్లిదండ్రుల్ని కూడా పిలిపించాడట మద్రాసు. వాళ్ళుకూడా వెళ్ళి పక్షం కావస్తోంది" అంటూ రామనాధం చెప్పుకు రాసాగాడు.

ఏవిటో గొడవ అన్నట్టు వీరభద్రం కిటికీలోంచి బయటికి చూస్తూ కాస్సేపు ఆలోచించాడు.

ఆదుర్దాతో ప్రిన్సిపాల్ రూములో అడుగుపెట్టి, తొట్రుపాటు గొంతుతో తన విషయం వివరించి ప్రిన్సిపాల్ వ్రాసిన ఉత్తరం చూపించి ఏమిటని ప్రశ్నించాడు వీరభద్రం. ఆశతో ఆచూకీలకొరకు రామనాధంకూడా కొన్ని ప్రశ్నలు వేశాడు. కానీ ఇద్దరూ నిరుత్సాహంతో బయటికి వచ్చారు.

మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చి రామనాధం లోపలికి వెళ్ళి బయటికి వచ్చాడు. "చక్రవర్తిగాడు పరీక్షలు కూడా వ్రాశాడట" అన్నాడు వీరభద్రంతో.. "అయితే యిప్పుడేమంటావ్?" అన్నాడు వీరభద్రం.

"వాడింటి అడ్రెసు తీసుకున్నాను.. పోదాం పదండి మాంబళం" అంటూ దారితీశాడు రామనాధం.

ఇంటిగేటు మూసివుంది. "చక్రవర్తి సినీ ఆర్టిస్ట్" అని బోర్డు ఉంది.

గేటు దగ్గర తారట్లాడుతూ "పెద్ద కాంపౌండూ, బంగళానూ, వీడెవరో సినిమా యాక్టరు – ఛా వీడై ఉండడు " అనగానే గేటు వెనక భౌమన్న ఆల్సేషియన్ కుక్క అరుపుకు ఉలిక్కిపడ్డాడు వీరభద్రం. 'కుక్కలున్నాయి జాగ్రత్త ' అని నత్తురు నత్తురుమంటూ వ్రాసి ఉన్న బోర్డు చదివాడు రామనాధం.

ఇంతలో బంగళా సింహద్వారం లోంచి సిల్కులాల్చీ, పైజమా వేసుకున్న ఒక యువకుడు మూర్తిగొన్న యువతలాగా, సుందరతలాగా దగ్గరకు వచ్చి చూసి, గేటు తెరిచాడు రామనాధం నిలువునా ఆశ్చర్యపోయి నేనెవరో అనబోయాడు "అదేమిటండి.. గుర్తుపట్టాను రండి " అని ఆప్యాయంగా నవ్వి ఆహ్వానించాడు యువకుడు.

వీరభద్రం వెనుదిరిగి చూశాడు. అవమానం, ఆశ్చర్యం, భయం మూడు ముప్పిరిగొని ఉక్కిరి బిక్కిరైపోయాడు. తలదించుకుని మెల్లిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు వీరభద్రం. రామనాధం ఏమీ చేయలేక ఇటు యువకుడివైపూ అటు వీరభద్రంవైపూ చూస్తూ నిలబడ్డాడు. యువకుడు ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయాడు క్షణం.

ఇంతలో పెద్ద ప్లిమత్ కారు ఒకటి మెల్లిగా నడచి రెండడుగులు సాగిన వీరభద్రం ముందు ఆగింది.

కార్లోంచి దిగిన ఒక బక్కపల్చటి పెద్దమనిషిని చూసి వీరభద్రం నివ్వెరపోయాడు. అయిదువేళ్ళకు తొడిగిన రాళ్ళ ఉంగరాలు ధగధగ మెరుస్తుండగా వీరభద్రం భుజంపై చెయ్యి వేసి "రండి.. వీరభద్రంగారూ" అంటూ లోపలికి ఆహ్వానించి తీసుకువచ్చాడు.

గేటు దగ్గర నిలుచుండిపోయిన యువకుణ్ణి చూపిస్తూ "వీడెవరో మీకు తెలుసనుకుంటాను" అన్నాడు ఆ వ్యక్తి.

గొంతు కాస్త సర్దుకుని "మీ అబ్బాయి" నేను గుర్తుపట్టాను అన్నాడు అధోస్వరంతో వీరభద్రం. "కారు అయితే సరిగా గుర్తించలేదు. ప్రఖ్యాత సినీనటుడు. లక్షాధికారి పూర్వాశ్రమంలో ఒక బడిపంతులు కొడుకు – పేరుకు మాత్రం చక్రవర్తి " అని కొంచెం ఆగి పరిహాసంగా చూశాడు వీరభద్రం ముఖంలోకి ఆ పెద్ద మనిషి.

అణువు అణువు తనువెల్లా మాటలు ఈటెలై బాధించగా "సూర్యం అదృష్టవంతుడివి నాకు ఈ జన్మలోనే బాగా బుద్ధి చెప్పావు" అని గొణిగాడు తలవంచుకుని వీరభద్రం.

ఏమీ అర్థంకాక తనను తను గిల్లి చూసుకుని మరీ చూస్తున్నాడు రామనాధం.

తిరిగి సూర్యం అందుకున్నాడు. "అప్పటి చక్రవర్తికాదు సుమండీ వీరభద్రం గారు. అన్నానికి లేనివాడు చక్రవర్తి ఏమిటంటూ మీరు నా ముఖాన్నే నిందించారు కనుకనే మీ ముఖాన్నే నేను ఒక మాట చెప్పవలసివస్తున్నది. నా కొడుకు ఈనాడు మీ ఇంటికే చక్రవర్తి – మీ అమ్మాయి నా కోడలు."

ఈ మాటలు విని ఒక్కసారి గరిమనాభి తిప్పినట్లయింది వీరభద్రానికి. ఉప్పెనలో తెప్పమీద ఉన్నట్లు కళ్ళు తిరిగిపోయాయి.

"మంగళాశంసనం పొలిమేర దగ్గరనే అయిందిగా. సరే లోపలికి దయచేయండి బావగారూ, అమ్మాయినీ అల్లుణ్ణీ దీవించండి " అంటూ సూర్యం దారితీశాడు భావగర్భితంగా.

వెంటనే వెనకనించి రామనాథం అన్నారు. “ఇంత ఆస్తిపరులై కట్నం ఆశించలేదు సరిగదా, ఉన్న చెంబూ తప్పేలా కూడా ఎదురిచ్చి చేసుకున్నట్లయింది” అన్నాడు.

వీరభద్రం "దొ టూ బ్రూటస్" అన్నప్పటి సీజర్ ముఖం పెట్టి “రామనాథం ఆయన అన్నది చాలక నువ్వు కూడానా" అన్నాడు సినిమాలో నటుడిలాగ.

అమ్మాయిని వెతుక్కుంటూ వచ్చి ఒక గొప్ప ఇంటి కోడలిగా చూసిన ఆనందంతో వీరభద్రం, విపర్యయ సిద్ధాంత ప్రవక్త రామనాథం ఇల్లు చేరుకున్నారు మర్నాడు.

మర్నాడు ఒళ్ళు పట్టించుకుంటూ వీరభద్రం ” నీ విపర్యయ సిద్ధాంతం వీగిపోయిందోయ్ రామనాథం, దానిప్రకారం చక్రవర్తి ఏమీ లేని వాడు కావాలి. ఆ కార్లలో షికారు చేసేవాడు ఎలా అవుతాడు? ” అన్నాడు సల్లాపంగా.

“లంకంత మీ కొంపకు వాడు చక్రవర్తి అయ్యాడే. బ్రతకలేక బడిపంతులు కొడుకు విపర్యయం కాదుటండీ” అన్నాడు రామనాథం.

“మరి వాళ్ళ పెళ్ళి మన అంతస్థుకు తగ్గట్టు చేద్దామండీ– ఆ రిజిష్టీ పెళ్ళితో సరిపెట్టుకోక. ఒక్కగానొక్క పిల్ల మనకు ” అంది వర్ధనమ్మ.

“చిన్నపిల్లలు పెద్దవాళ్ళకు బాగా బుద్ధి చెప్పారు. ఓడలు బళ్ళూ, బళ్ళు ఓడలూనూ. సదరు కథ అంతా విపర్యయాలూ, విడ్డూరాలూనూ” అని గొణుక్కుంటూ మెట్లు దిగి ఇంటికెళ్ళాడు రామనాథం.

**COMMENTS**